ప్రశాంతంగా పది పరీక్షలు

మూసాపేట: పదవ తరగతి పరీక్షలు రెండవ రోజు ప్రశాంతంగా జరిగాయి. బాలానగర్ మండల పరిధిలో 2,332 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏడుగురు గైర్హాజరయ్యారని ఎంఈఓ హరిచంద్ తెలిపారు. అదే విధంగా కూకట్‌పల్లి మండల పరిధిలో 7,888 మంది విద్యార్థులు హాజరయ్యారు. 19 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ కిషన్ తెలిపారు.

మల్లికార్జున స్వామి ఉత్సవాలు ప్రారంభం

మూసాపేట: మూసాపేట డివిజన్ యాదవబస్తీలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయ ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం గంగకు పోవుట, గంపల ఊరేగింపు వంటి పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆదివారం ఉదయం 5 గంటలకు రుద్రాభిషేకం, బిల్వార్చన, 11 గంటలకు పెద్ద పట్నం, 11.30కు మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం, సాయంత్రం 4 గంటలకు అగ్ని గుండాలు, గొలుసు తెంపుట, మల్లన్న బోనాలు నిర్వహించనున్నారు.

వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా..


నీటిని తొలగిస్తున్న స్థానికులు, కార్పొరేటర్ తదితరులు

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని వినాయక నగర్ గడ్డిచేను సమీపంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి నీరు ఆగడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవు రవీందర్ రెడ్డి స్థానికులతో కలిసి వర్షపునీటిని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన ఓపెన్ స్ట్రాం వాటర్ డ్రైన్ పనుల్లో నాణ్యత లేకపోవడం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల వర్షపునీరు నిలిచిందన్నారు. కాంట్రాక్టర్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండల పరిధిలోని భూదేవి హిల్స్. తులసినగర్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం సమీపంలో గల 336 సర్వే నంబర్‌లోని అక్రమ నిర్మాణాన్ని శనివారం కూల్చివేశారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టవద్దని ఆర్ఐ ఆగస్త్యన్ అన్నారు. ప్రభుత్వ భూమిని తప్పుడు సర్వే నంబర్‌లు చూపి అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు స్పందించి జేసీబీ సాయంతో కూల్చివేతలు చేపట్టారు. కబ్జాదారులు అడ్డుకోవడానికి యత్నించినప్పటికీ నేలమట్టం చేశారు.

లక్ష విరాళం అందజేత



కూకట్‌పల్లి: సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి ఆంజనేయ స్వామి రాతి విగ్రహం కోసం శనివారం విరాళం అందజేశారు. కూకట్‌పల్లికి చెందిన మర్యాద అశోక్, రమాదేవి దంపతులు లక్ష రూపాయలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు..



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్‌కు చెందిన జి. రామారావుకు రూ. 1.50 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును శనివారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి శేరిలింగంపల్లి అసెంబ్లీ పరిధిలో శనివారం పర్యటించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కొరదాల నరేష్ స్వగృహంలో పలువురు నాయకులు ఆయనను సన్మానించారు. – ఆల్విన్‌కాలనీ



రహదారులపై మురుగు!

• అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ • దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

రహదారులపై మురుగు పారుతోంది. దుర్గంధంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిలోమీటర్ల కొద్దీ మురుగు నీరు పారుతున్నా సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఈగలు, దోమలు వృద్ధి చెంది పగలు, రాత్రి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


ఆల్విన్‌కాలనీలో జలకన్య హోటల్ సమీపంలో..

ఆల్విన్‌కాలనీ: వీధులన్నీ మురికి కూపంగా మారాయి. డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతుండటంతో దుర్వాసన భరించలేక వ్యాపారులు, స్థానికులు తలుపులు మూసి గడపాల్సి వస్తుంది. రహదారులపై మురుగు పారుతుండటంతో వేగంగా వెళ్లే వాహనాల తాకిడికి మురుగు పడి చిన్నపాటి గొడవలకు దారి తీస్తున్నది. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి డివిజన్, పాపారాయుడునగర్, ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని ప్రధాన రహదారిలో కొన్ని నెలలుగా మురుగునీరు పొంగి పొర్లుతుంది. అదేవిధంగా ఆల్విన్‌కాలనీ, జలకన్య సెంటర్ నుంచి సాయినగర్‌కు వెళ్లే దారిలోని మూలమలుపు వీధిలో డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. ఎల్లమ్మబండ ప్రధాన రహదారి గుడ్‌విల్ హోటల్ సమీపంలో, ఎల్లమ్మబండ, జయశంకర్ విగ్రహం సమీపంలోని, భాగ్యనగర్ కాలనీ ఉషాముళ్లపూడి రోడ్డును ఆనుకుని ఉన్న మాధవీనగర్ కాలనీలో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. వీధుల్లో మురుగు నిలుస్తోంది. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు కాలనీల్లో పర్యటించి డ్రైనేజీ సమస్య జఠిలంగా ఉన్న ప్రాంతాలను పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంక్షేమ సంఘాల సభ్యులు కోరుతున్నారు.


ఎల్లమ్మబండ గుడ్ విల్ హోటల్ వద్ద పారుతున్న మురుగు నీరు


పాపారాయుడు నగర్ కాలనీలో ..

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు

బాలానగర్: బాలానగర్‌లోని ఎస్ఎంఆర్ వినయ్ క్యాపిటల్ భవనంలో యాక్షన్ గ్రూపు సంస్థ కార్యాలయం సెక్యూరిటీ గార్డులకు శనివారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి సీఐ టి నర్సింహరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాచార సేకరణకు సైతం సిద్ధంగా ఉండాలని సూచించారు. కేవలం విధులు మాత్రమే నిర్వహించకుండా వారి కుటుంబంలోని పిల్లల విషయమై కూడా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులకు, సెక్యూరిటీ గార్డ్ వ్యవస్థకు చాలా దగ్గరి సంబంధాలు ఉన్నాయని వివరించారు. అనంతరం యాక్షన్ ఫోర్స్ సెక్యూరిటీ సంస్థ చైర్మన్ సుభాని అబ్దుల్ మాట్లాడుతూ.. ఫైర్ సేఫ్టీ యంత్రాలను ఎలా వాడాలో తప్పకుండా శిక్షణ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాత్రి వేళల్లో విధుల నిర్వహణలో సెక్యూరిటీ గార్డులు నిద్రపోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ అబ్దుల్ యుసుఫ్, బాలానగర్ ఎస్ఐ మహ్మద్ హాజీ మియా, సూపర్‌వైజర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న నరసింహరాజు

చిన్నారులకు ఉచితంగా ఆటిజం పరీక్షలు

ఆల్విన్‌కాలనీ: వీ కెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆటిజం పిల్లల కోసం ప్రత్యేక ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని భాగ్యనగర్ కాలనీలోని జయానగర్‌లో నిర్వహించారు. ఈ శిబిరంలో ఎల్.వి ప్రసాద్ ఆసుపత్రికి చెందిన కంటి వైద్యులు పరీక్షించి, వారికి అవసరమైన చికిత్సా సూచనలు చేశారు. అవసరమైన వారికి కళ్లజోడు ఉచితంగా అందజేశారు. పిల్లల ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకొని మార్గదర్శకాన్ని అందించారు. ఈ సందర్భంగా వీ కెన్ ఫౌండేషన్ ఫౌండర్ శ్రీనివాసులు గౌడ్ మాట్లాడుతూ.. ఆటిజం పిల్లలపై ప్రతిరోజూ కేర్ తీసుకోగలిగితే వారి జీవన నాణ్యత మెరుగవుతుందన్నారు.



అనుమతులు నిలిపి వేయడం సరికాదు


వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి మండలం హైదర్‌నగర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 145, 163లలో భవన నిర్మాణం అనుమతులను ఇటీవల కాలంలో నిలిపివేశారని, వెంటనే నిర్మాణాలకు అనుమతులు జారీ చేయాలని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శనివారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వివిధ కాలనీ అసోసియేషన్ల అధ్యక్షులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసంతనగర్, సర్దార్ పటేల్‌నగర్, భగత్‌సింగ్ నగర్ ఫేజ్ 1,2, సిబిసిఐడి, ఎన్ఆర్ఎస్ఏ, డైమండ్ ఎస్టేట్స్ పరిధిలోని ఇళ్ల స్థలాల్లో భవన నిర్మాణాలకు జీహెచ్ఎంసీ అనుమతులు నిలిపివేయడంపై విస్మయం వ్యక్తం చేశారు. గడిచిన 35 సంవత్సరాలుగా అనుమతులు ఇచ్చారని, వేలాది భవన నిర్మాణాలు జరిగాయని ఆయన దృష్టికి తెచ్చారు. ప్రజల సొంతింటి నిర్మాణ అవసరాలను దృష్టిలో పెట్టుకుని వెంటనే నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, నాగేశ్వరరావు, వర్మ, హనుమంతరావు, నాని పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని మంత్రికి వినతి

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని శనివారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. కొంపల్లి మున్సిపాలిటీని గత ప్రభుత్వం విస్మరించిందని, మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో పీఎంఆర్ ఎన్‌క్లేవ్ నుంచి పామ్ మీడోస్ వరకు, శాంతినగర్ కాలనీ వయా అపర్ణ పామ్‌గ్రోవ్ సెప్టిక్ ట్యాంక్ వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మైకసా స్టెర్లింగ్ రోడ్డు నుంచి అవని గార్డెన్ వరకు, జయభేరి కాలనీలో ఓల్డ్ గోడౌన్ రోడ్డు నుంచి సెంట్రల్ పార్క్ వరకు డ్రైనేజీ లైన్, సీసీ రోడ్లు, ఊరచెరువు సుందరీకరణ తదితర అభివృద్ధి పనులకు రూ.10 కోట్ల నిధులను మంజూరు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అభివృద్ధి చేపట్టాల్సిందిగా ఆదేశించారు. ఆయన వెంట కాంగ్రెస్ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ జిమ్మి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్


పోలీసుల అదుపులో కార్మిక సంఘం నాయకులు

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేష్

జగద్గిరిగుట్ట: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన ఇందిరాపార్క్ ధర్నాకు వెళ్లకుండా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. ధర్నాకు ఏఐటీయూసీ నాయకత్వం వెళుతున్నారని ముందస్తు సమాచారంతో శనివారం ఉదయాన్నే పోలీసులు వారిని అరెస్టు చేశారు. అరెస్టైన వారిని సీపీఐ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా, హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షులు హరినాథ్ రావు, కోశాధికారి సాయిలు, సీపీఐ కార్యదర్శి సహదేవరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు స్వామి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి వెన్నెల.. అలరించిన అన్నమయ్య కీర్తనలు

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న వేసవి వెన్నెల కార్యక్రమంలో భాగంగా చిన్నారులు అన్నమయ్య కీర్తనలతో అలరించారు. సమ్మర్ క్యాంపులో భాగంగా పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు అన్నమయ్య కీర్తనలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఈనెల 25వ తేదీ వరకు శిక్షణ ఉంటుంది.

ఇంటి వద్దకే సీతారాముల తలంబ్రాలు

మియాపూర్: భద్రాచలం సీతారాముల కల్యాణం తలంబ్రాలు ఇంటి వద్దకు వచ్చేలా బుక్ చేసుకునే అవకాశంను ఆర్టీసీ కల్పించిదని మియాపూర్-2 డిపో మేనేజర్ వెంకటేశం, ఏఎంటీ ప్రశాంత్‌రెడ్డి, డిపో మార్కెటింగ్ ప్రతినిధి రమేష్‌గౌడ్ తెలిపారు. స్వామి వారి తలంబ్రాలు కావాలనుకునే భక్తులు 8919525373, 9154298825 నంబర్లలో సంప్రదించి రూ.151లు చెల్లించి రశీదు పొందాలని తెలిపారు. కళ్యాణానికి వెళ్లలేని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

రాయదుర్గం: హైటెక్‌సిటీ పరిధిలో పలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. శనివారం గచ్చిబౌలి డీఎల్ఎఫ్ రోడ్డులోని వరలక్ష్మీ టిఫిన్ సెంటర్‌ను అధికారులు పరిశీలించారు. నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదని అధికారులు గుర్తించారు. కిచెన్‌లో యథేచ్ఛగా ఎలుకలు సంచరించడం, డ్రైనేజీలో ఆహార వ్యర్థాలను వేయడంతో మురుగునీరు పొంగి దుర్వాసన వెదజల్లుతోందని అధికారులు తెలిపారు. అనంతరం మాదాపూర్‌లోని క్షత్రియ ఫుడ్ రెస్టారెంట్‌లో సింథటిక్ రంగులు వాడుతున్నట్లు గుర్తించారు. కిచెన్‌లో రిఫ్రిజిరేటర్ అధ్వానంగా ఉండడంతో బాటు చికెన్, మటన్ నిల్వ ఉన్నట్టు అధికారులు గుర్తించారు.

భూముల పరిరక్షణకు 'పోస్టు కార్డు' ఉద్యమం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు అఖిల భారత విద్యార్థి పరిషత్ హెచ్‌సీయూ శాఖ ఆధ్వర్యంలో 'పోస్టు కార్డు' ఉద్యమం చేపట్టింది. శుక్రవారం రాత్రి హెచ్‌సీయూలో 'సేవ్ హెచ్‌సీయూ ల్యాండ్స్' పేరిట పోస్టు కార్డుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివేకానంద స్టూడెంట్స్ అమెనిటీస్ సెంటర్ వద్ద ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆయుష్‌కుమార్‌సింగ్‌లు మాట్లాడుతూ హెచ్‌సీయూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధిస్తూ నగరపేరును యావత్ ప్రపంచానికి చాటి చెబుతోందని, ఇంతటి ప్రాధాన్యత కలిగిన హెచ్‌సీయూ క్యాంపస్ భూమిని ప్రభుత్వం విక్రయించాలని నిర్ణయించడం తగదన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ ఉద్యమంలో క్యాంపస్‌లో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తామన్నారు.

టెలికామ్‌నగర్ సమస్యల పరిష్కారానికి చర్యలు

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని, త్వరలో కాలనీలో పర్యటిస్తానని ఎమ్మెల్యే గాంధీ హామీ ఇచ్చారు. శనివారం టెలికామ్‌నగర్‌వాసులు ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. కాలనీలో చాలా రోడ్లు అధ్వానంగా మారాయని, మంచినీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, సరఫరా సమయం పెంచాలని కోరారు. పలుచోట్ల మురుగునీరు రోడ్లపైకి వస్తోందని ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

శిశువు మృతదేహం స్వాధీనం

మాదాపూర్: నవజాత శిశువు మృతదేహం లభ్యమైంది. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని మెడికవర్ ఉమెన్స్, చైల్డ్ హాస్పిటల్ పక్కన బస్టాప్ ముందు ఉన్న డ్రైనేజీ వద్ద మగశిశువును శనివారం గుర్తించారు. తెల్లవారు జామున 5.30 గంటలకు హాస్పిటల్ సెక్యూరిటి సిబ్బంది చూసి డాక్టర్‌కి, పోలీసులకు సమాచారం అందించారు. వర్షానికి కొట్టుకువచ్చి డ్రైనేజీ వద్ద నిలిచిపోయినట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు


డ్రైనేజీ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆయా డివిజన్‌లలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని మొగులమ్మ బస్తీ కాలనీలో రూ.35 లక్షల అంచనా వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ చిన్న సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కాలనీలను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం నాగప్రియ, మేనేజర్ ఝాన్సీ, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి

కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: పార్కుల్లో సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేస్తున్నామని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్‌లో ఉమెన్స్ పార్కు, సున్నం చెరువు పార్కుల్లో శనివారం పర్యటించారు. మహిళా పార్కులో టెన్నిస్ కోర్టు, బెంచీలు, ఓపెన్‌జిమ్ పరికరాల మరమ్మతులు, పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, సున్నం చెరువు పార్కులో గ్రీనరీ పెంచాలని, బెంచీలు, భూగర్భ డ్రైనేజీ, మంజీర కనెక్షన్ ఇవ్వాలని, లైటింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు ఆమెను కోరారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి పార్కు అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, రమణ, శ్రీనివాస్ రెడ్డి, కాశీనాథ్ చారి, వెంకటేశ్వర్లు, జితేందర్ పాల్గొన్నారు.


పార్కులో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సబిహా బేగం

ఆకట్టుకుంటున్న హస్తకళా ప్రదర్శన


కొనుగోలు చేస్తున్న మహిళలు

మోతీనగర్: ప్రతి ఒక్కరూ వారానికి ఒక్కసారైనా చేనేత, ఖాదీ వస్త్రాలను ధరించి చేనేత కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉండాలని కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శన నిర్వాహకులు వినోద్ జై తెలిపారు. కొన్ని రోజులుగా మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో కళా సిల్క్, చేనేత హస్తకళ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. ఈ మేళా కొన్ని రోజుల మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో తయారైన చీరలు, గాజులు, చేనేత వస్త్రాలు, వన్ గ్రామ్ గోల్డ్, నిత్యావసర వస్తువులు, సామాన్యుల నుంచి సంపన్నుల వరకు వినియోగించే అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా కొనసాగుతుందన్నారు. పాత కంచిపట్టు, బెనారస్, గద్వాల్, వెంకటగిరి చీరలు వివిధ డిజైన్‌లలో ఉన్నాయన్నారు.

ఘనంగా వార్షిక ఆరాధన ఉత్సవాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ద్వాదశ జ్యోతిర్లింగ దేవాలయ వ్యవస్థాపకులు పుల్లూరు నారాయణదాసు 25వ వార్షిక ఆరాధన ఉత్సవాలు కూకట్‌పల్లి ఆలయంలో శనివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ హాజరై పాలాభిషేకం, పుష్ప బిల్వార్చన తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కృష్ణరాజ్‌పుత్, మేకల రమేష్, శివా చౌదరి, బండి సుధా, స్వరూప తదితరులు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న బండి రమేష్, వెంకటేశ్వరరావు

నీటి వృథాపై అవగాహన కల్పిస్తున్న వాలంటీర్లు



నీటి సంరక్షణపై అవగాహన

నిజాంపేట్: ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శనివారం యూత్ ఫర్ సేవ వాలంటీర్ల ఆధ్వర్యంలో నీటి సద్వినియోగం, నీటి కాలుష్య నివారణ, వాన నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ.. ప్రాణవాయువు తరువాత నీరే మనకు ప్రాణాధారమని, మనకున్న నీరు పరిమితమని అన్నారు. వృథా చేయకుండా నీటిని పరిమితంగా వాడుకోవాలని సూచించారు. వాన నీటిని సంరక్షించి, నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పక్షుల నీటి అవసరాలకై నిజాంపేట్ కార్పొరేషన్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్న చెట్లకు నీటి కుండీ (ఉట్టీ)లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు, శ్రీనివాస్ భరత్‌ముఖ్, సత్య కాటేపల్లి, కల్యాణి, భారతి, రామనారాయణ, లక్ష్మీ రామారావు, నవీన్, చంద్ర, మధు, శ్రీనివాస్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.